క్లుప్తంగా

గూడూరులో భారీ అన్నదాన కార్యక్రమం

గూడూరు: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గూడూరు టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కూడలిలో శనివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 3వేల మంది హాజరైనట్లు భక్త బృందం తెలిపింది.

24 నుంచి మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

గూడూరు: కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాలలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక ఈనెల 24, 25 తేదీల్లో గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత తెలిపారు. అండర్-14 విభాగానికి సంబంధించి 2011 జనవరి 1 తర్వాత జన్మించిన వారు, అండర్-17 విభాగానికి 2008 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులని వెల్లడించారు. ఈనెల 24న బాలుర, 25న బాలికా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఉంటుందని, మండలంలోని వివిధ పాఠశాలలల్లో ఆసక్తి కలిగిన క్రీడాకారులు హాజరుకావాలని ఆమె కోరారు.

సాగరతీరంలో పరిశుభ్రత దినోత్సవం

కోడూరు: అంతర్జాతీయ కోస్టల్ క్లీన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు శనివారం హంసలదీవి సాగరతీరం పరిసరాలను శుభ్రపర్చారు. మెరైన్ సీఐ సురేష్ రెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది తీరం వెంట ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు అలలతో పాటు కొట్టుకు వచ్చిన కర్ర దుంగలను సేకరించి దగ్ధం చేశారు. ఎస్ఐ జిలానీ, సిబ్బంది పాల్గొన్నారు.

మోపిదేవి దేవస్థానంలో స్వచ్ఛతా హీ సేవ

మోపిదేవి: మోపిదేవిలో ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం, పెదకళ్లేపల్లిలో ఉన్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు నేతృత్వంలో ఉదయం ఆలయ అధికారులు, సిబ్బంది స్వయంగా చీపుర్లు పట్టి కార్యాలయాలను శుభ్రం చేశారు.

వరద బాధితులకు కుక్కర్లు, వంటపాత్రలు పంపిణీ



కె.కొత్తపాలెం(మోపిదేవి): నియోజకవర్గ విద్యా కుటుంబం వరద బాధితులకు అందించిన సహాయం అపూర్వమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి అన్నారు. మండలంలోని కె.కొత్తపాలెంలో శనివారం వరద బాధితులకు కుక్కర్లు, వంటపాత్రలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గ్రామసర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, ఎంపీటీసీ మత్తి లత, పూషడపు రత్నగోపాల్, రావి రత్నగిరి, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కొక్కిలిగడ్డలో మంచి ప్రభుత్వం కరపత్రాల పంపిణీ

మోపిదేవి: కూటమి ప్రభుత్వం మంచి పేరు తెచ్చుకుందని కొక్కిలిగడ్డ గ్రామ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో సాధించిన విజయాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

నాగాయలంక: రేమాలవారిపాలెం శివారు పేర్లవానిలంక గ్రామానికి చెందిన కైతేపల్లి వెంకట నాంచారయ్య బడ్డీ కొట్టులో అక్రమంగా నిల్వ ఉంచిన 200 కేజీల రేషన్(పీడీఎస్)బియ్యం పట్టుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కలిదిండి రాజేష్ శనివారం చెప్పారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ తెలిపారు.

డెప్యూటీ సీఎం శాఖలో నిర్లక్ష్యపు జాడ్యం

- అస్తవ్యస్తంగా సామూహిక నీటి పథకం నిర్వహణ
- 20 గ్రామాలకు శుద్ధి చేయని కలుషిత నీరు
- రోగాల బారిన పడుతున్న ప్రజానీకం
- పట్టించుకోని అధికారులు

నేతిబీరకాయలో నెయ్యి లేనట్టే... పేరుకు రక్షిత మంచినీటి పథకం అయినా ఆ నీటితో ప్రజల ఆరోగ్యానికి రక్షణ కరవైంది. 20 గ్రామాల్లోని దాదాపు 14 వేల జనాభా తప్పనిసరి పరిస్థితుల్లో గత కొన్ని నెలలుగా ఆ కలుషిత నీరే తాగవలసి వస్తోంది. అయినా సంబంధిత అధికారులకు చీమ కుట్టినట్టయినా ఉండదు. పల్లె జనం ఏమైపోతే వారికేం... అన్నట్టుగా సంబంధిత శాఖాధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. సాక్షాత్తూ డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న శాఖలోనే ఇంతగా నిర్లక్ష్య జాడ్యం పేరుకుపోయింది.

గూడూరు: మనిషి జీవనానికి తాగునీరు ఎంతో అవసరం. స్వచ్ఛమైన తాగునీరు లభించక, కలుషిత నీటిని తాగి ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. దీనిని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్న లక్ష్యంతో రక్షిత నీటి పథకాలకు శ్రీకారం చుట్టాయి. గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) ద్వారా సామూహిక నీటి పథకాలు ఏర్పాటు చేసి శుద్ధి చేసిన నీటిని పైప్‌లైన్ ద్వారా గ్రామాలలోని రక్షిత నీటి పథకాలకు పైప్‌లైన్‌తో అనుసంధానం చేసి కుళాయిల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే సామూహిక నీటి పథకాల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా 'అంగట్లో అన్నీ ఉన్నా...' అన్న చందంగా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో కలుషిత నీరే తాగి రోగాల బారిన పడుతున్నారు. మండలంలోని ముక్కొల్లులో సామూహిక రక్షిత నీటి పథకమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

ఆగస్టు మొదటివారంలో స్కీం ఇన్‌టేక్ వాల్వ్ విభాగంలోని మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. ప్రత్యామ్నాయంగా వేరే మోటారు ఏర్పాటు చేయకుండా రక్షిత నీటి పథకం చెరువు నుంచి శుద్ధి చేయని నీటిని సంపులోకి నింపి ఓహెచ్ఆర్ ద్వారా గ్రామాలకు సరఫరా చేసేశారు. ఆ చెరువుకు కనీసం ఫెన్సింగ్ కూడా లేకపోవడంతో పశువులు, మేకలు, గొర్రెలు చెరువులోకి దిగి నీటిని కలుషితం చేస్తున్నాయి. ఇలా కలుషితమైన నీటిలో కేవలం బ్లీచింగ్ కలిపి నెలరోజుల పాటు గ్రామాలకు సరఫరా చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. మరో పక్క రేడియేటర్ నుంచి క్యాలిఫ్లో లీటర్‌కు నీరు సరఫరా అయ్యే ప్రాంతంలోని ఇనుప షట్టర్, శుద్ధి చేసిన నీరు సంప్‌లో నిల్వ చేసిన తర్వాత ఓవర్‌హెడ్ ట్యాంకుకు పంపే పైప్ లైన్ పూర్తిగా తుప్పు పట్టి పోయాయి. అలా తుప్పు పట్టిన పైపుల ద్వారా సరఫరా అయ్యే నీటిలో తుప్పు ప్రభావం తప్పకుండా ఉంటుంది. అధికారులు అదే నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. నీటిని శుద్ధి చేసే శాండ్ ఫిల్టర్లు కూడా నిర్వహణ కరువై పూర్తి స్థాయిలో నీటిని శుద్ధి చేయలేకపోతున్నాయి.



ముక్కొల్లు రక్షిత నీటి పథకం చెరువులో సేద తీరుతున్న గేదెలు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

అధికారిక లెక్కల ప్రకారం 20 గ్రామాల్లోని దాదాపు 14 వేల జనాభాకు ఈ పథకం ద్వారా నీరు సరఫరా అవుతోంది. అలాంటి పథకం విషయంలో అధికారులు ఇంతటి నిర్లక్ష్యధోరణితో వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తూ డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మంత్రిగా వ్యవహరిస్తున్న గ్రామీణ నీటి సరఫరా విభాగంలో అధికారులు ప్రజల ఆరోగ్యం విషయంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా కలెక్టర్ ముక్కొల్లు సామూహిక నీటి పథకం నిర్వహణపై సమగ్ర విచారణ నిర్వహించి, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్న అధికారులపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



రేడియేటర్ నుంచి క్యాలిఫ్లోలీటర్‌కు నీరు సరఫరా అయ్యే ప్రాంతంలో తుప్పు పట్టిన షట్టర్



సంప్ నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీటిని నింపే పైప్‌లైన్ పూర్తిగా తుప్పుపట్టిన దృశ్యం

కిడ్నీ వ్యాధి బాధిత బాలుడికి మంత్రి కొల్లు పరామర్శ



మచిలీపట్నంటౌన్: స్థానిక 50వ డివిజన్ డ్రైవర్స్ కాలనీలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న దొడ్డాకుల ఏసువరప్రసాద్ కుమారుడు శ్యామ్‌సంతోష్‌ను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర శనివారం పరామర్శించారు. బాలుని ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి గాని, ఎన్టీఆర్ వైద్యసేవ పథకం నుంచి గాని సాయం అందజేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ ఎంవీ బాబాప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు ఇలియాస్‌పాషా, తహసీల్దార్ శ్రీనివాస్, టీడీపీ నాయకులు అక్కు మహంతిరాజ, నాగరాజు తదితరులు ఉన్నారు.

సర్కారుతోటలో అన్న సమారాధన

మచిలీపట్నంటౌన్ : స్థానిక సర్కారు తోటలోని గణపతి నవరాత్రి పందిరి వద్ద శనివారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. నవరాత్రుల ముగింపు అనంతరం భారీ ఊరేగింపుతో గణనాథుని మంగినపూడి బీచ్‌లో నిమజ్జనం చేసిన నిర్వాహకులు శనివారం భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్కారుతోట వాసులతో పాటు చిలకలపూడి, జెడ్పీసెంటర్, పరాసుపేట, ఎన్టీఆర్ కాలనీ, నవీన్‌మిట్టల్ కాలనీ, బ్రహ్మపురం, వలందపాలెం, పెయింటర్స్ కాలనీ, ఉల్లిపాలెం, హమాలీ కాలనీ, కొత్తపేట, మాచవరం, ఎస్‌వీఆర్ నగర్, డ్రైవర్స్ కాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

రైతుల సంక్షేమానికి కృషి చేస్తా

ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

ఘంటసాల: నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాల పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో ఇది మంచి ప్రభుత్వం గ్రామసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఇచ్చిన హామీల్లో భాగంగా రోడ్లు అభివృద్ధి చేస్తామని, ప్రస్తుతం ఇబ్బందుల్లేకుండా గుంతలు పూడ్చే కార్యక్రమం చేపడతామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పటికే ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాంకు నిధుల కోసం కృషి చేస్తున్నారన్నారు. మండలంలో రూ.3 కోట్లతో సీసీ రోడ్లు మంజూరు చేశామన్నారు. సకాలంలో పూర్తి చేస్తే మరిన్ని రోడ్లు మంజూరు చేయిస్తానన్నారు. రైతులకు సాగునీరు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవడంతో తాగు నీరు అందిస్తామన్నారు. రైతులకు ఉత్తమ ధాన్యం కొనుగోలు విధానం ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ముందుగా పంచాయతీ ప్రాంగణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి బుద్ధప్రసాద్ నేతలతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు విజయవంతం చేసిన సర్పంచ్‌లకు ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం ఘంటసాల వ్యవసాయ పాలిటెక్నిక్ రోడ్డును రూ.7లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మొక్కలు నాటారు.



ఘంటసాల మండల పరిషత్ ప్రాంగణంలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

జనసేన నేతల అసంతృప్తి?

ఘంటసాల పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన మంచి ప్రభుత్వం గ్రామ సభలో జనసేన ప్రజా ప్రతినిధులను కాని, నేతలను కాని స్టేజీ పైకి పిలవకపోవడంతో పలువురు జనసేన నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, సీనియర్ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్, సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్, తహసీల్దార్ బి.వి జయ ప్రసాద్, ఈవో టి.జయలక్ష్మి, వేమూరి సాయి, నియోజకవర్గ పరిశీలకుడు కనకపర్తి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డ్వాక్రా మహిళలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.

తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందాం

పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

కృత్తివెన్ను: సహజ సిద్ధ వనరుల్లో ముఖ్యమైనది సముద్రమని, అటువంటి తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా జలరాశులను కాపాడుకోవాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ తీర పరిశుభ్రతా దినోత్సవం, స్వచ్ఛ భారత్‌లో భాగంగా స్వచ్ఛసాగర్ సురక్ష కార్యక్రమాన్ని శనివారం మండలంలోని పెదగొల్లపాలెం, ఒర్లగొందితిప్ప బీచ్‌లలో నిర్వహించారు. ఇన్‌కాయిస్, హైదరాబాద్ సంస్థ, మత్స్యకార సంక్షేమ సమితి సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీచ్‌లలో ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు, చెత్త చెదారాన్ని శుభ్రపరిచారు. సునామీ ముందస్తు హెచ్చరికలు, అధిక అలలు, తుపానులు, ఆల్గల్ బ్లూమ్ హెచ్చరికలు మొదలైన వాటిని ఇన్‌కాయిస్ ప్రతినిధి ఎస్‌డీ మోయిన్ వివరించారు. కార్యక్రమంలో మెరైన్ సీఐ వసంత బాబు, ఎస్ఐ రవివర్మ, సర్పంచ్ మహాలక్ష్మి, మత్స్యకార సంక్షేమ సమితి సభ్యుడు రమణమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. చినగొల్లపాలెం బీచ్‌లో స్వామినాథన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నుంచి బాబ్జీ, శ్రీను, స్థానికులు పాల్గొన్నారు.



పెదగొల్లపాలెం బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

సామాజిక దురాచారాలపై పోరాడిన గురజాడ

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: సామాజిక దురాచారాలపై పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు అని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక గాంధీక్షేత్రంలో శనివారం గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ గురజాడ రచనలు సమాజాన్ని మేల్కొలిపాయని చెప్పారు. సామాజిక దురాగతాలను ఎండగట్టిన ఆయన రచనలు ప్రజలను చైతన్యవంతం చేశాయన్నారు. కార్యక్రమంలో గాంధీక్షేత్రం కమిటీ కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ ఘంటసాల రాజమోహనరావు(కన్నయ్య), శోభిల ఏడుకొండలు, దాసినేని సాంబశివరావు, అడపా శ్రీనుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

రఘురామను టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలి

అవనిగడ్డ: అంబేడ్కర్ ఫ్లెక్సీ ఉన్న బ్యానర్‌ని స్వహస్తాలతో తొలగించిన ఉండి నియోజకవర్గ శాసనసభ్యుడు రఘురామకృష్ణంరాజును టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఎమ్మెల్యే, భారత రాజ్యాంగ నిర్మాత ఫ్లెక్సీని తొలగించడం ఉన్మాద చర్యగా అభివర్ణించారు. అక్కడ బ్యానర్ల వల్ల ఏదైనా సమస్య తలెత్తితే చట్టబద్ధంగా నడచుకోవాలి కాని, తానే స్వయంగా ఫ్లెక్సీని తొలగించి అంబేడ్కర్‌ను అవమానించడం హేయమైన చర్య అన్నారు. ఎమ్మెల్యే అయి ఉండి ఒక వీధి రౌడీ లాగా వ్యవహరించిన రఘురామకృష్ణంరాజుపై చట్టపరంగా చర్య తీసుకోవాలని గోవర్ధన్ డిమాండ్ చేశారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



గూడూరు: పోష్టికాహార మాసోత్సవాలలో భాగంగా గూడూరులోని వెలుగు కార్యాలయంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ గ్లోరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషశ్రీ , ఆకుమర్రు మాజీ సర్పంచి గోపి నాగబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



చిలకలపూడి(మచిలీపట్నం):బుడమేరు వరద ఉధృతిలో ఇటీవల మృతి చెందిన కలిదిండి ఫణికృష్ణ కుటుంబానికి శనివారం మంత్రి కొల్లు రవీంద్ర ఆర్థిక సాయం అందజేశారు. మండల పరిధిలోని హుస్సేన్‌పాలెం గ్రామానికి మంత్రి రవీంద్ర వెళ్లి మృతుని భార్య జ్యోతికి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఇద్దరు ఆడపిల్లల చదువులకు ఏ సాయం కావాలన్నా ప్రభుత్వపరంగా అందిస్తామని హామీ ఇచ్చారు.

నవ్విపోదురు గాక...నాకేటి సిగ్గు

అవనిగడ్డ: నవ్విపోదురు గాక...నాకేటి సిగ్గు అన్నట్టు స్థానిక శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ వ్యవహార శైలి ఉంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మార్చి నెలలో శంకుస్థాపన చేసిన ఓఎన్‌జీసీ రహదారిని ఇప్పుడు తానే కొత్తగా ఓఎన్‌జీసీ అధికారులతో మాట్లాడి నిర్మాణానికి వారితో అంగీకరింపజేసినట్టు చెప్పుకోవడంపై నియోజకవర్గ ప్రజలు నవ్వుకుంటున్నారు.



గతంలో శంకుస్థాపన చేసిన శిలాఫలకం

నాగాయలంక మండలం వక్కపట్లవారిపాలెం సమీపంలో ఓఎన్‌జీసీ రిగ్ ఉంది. ఇక్కడకు వచ్చే భారీ వాహనాల వల్ల వక్కపట్లవారిపాలెం నుంచి రిగ్ ప్రాంతం వరకూ రహదారి ధ్వంసమైంది. ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులతో రహదారి నిర్మించాలని కోరినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానికులు ధర్నా చేయడంతో అప్పటి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఓఎన్‌జీసీ అధికారులతో మాట్లాడగా 2.2 కి.మీ మేర రూ.1.91 కోట్లతో రహదారి నిర్మించేందుకు ఓఎన్‌జీసీ అధికారులు ముందుకొచ్చారు. ఈ ఏడాది మార్చి 12న సింహాద్రి రమేష్‌బాబు ఈ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంగా నెలరోజుల్లో రహదారి పనులు పూర్తి చేస్తామని ఓఎన్‌జీసీ అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం ఎన్నికలు రావడంతో ప్రభుత్వ అధికారులు, ఓఎన్‌జీసీ అధికారులు పట్టించుకోలేదు. శుక్రవారం శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్‌ని ఓఎన్‌జీసీ అధికారులు కలవగా ఈ రహదారికి ఇప్పుడే కొత్తగా అధికారులు అంగీకరించినట్టు చెప్పుకొచ్చారు. గతంలో శంకుస్థాపన చేసిన రహదారికి తాజాగా అంగీకరించినట్టు చెప్పుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జీతాలిప్పించండి సారూ!

ఘంటసాల: ఆరు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు గురవుతున్నామని, జీతాలు ఇప్పించండి సారూ అంటూ ఘంటసాల మండలం డ్వాక్రా గూపు వీఓఏలు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌ను కోరారు. ఘంటసాల గ్రామంలో శనివారం జరిగిన మంచి ప్రభుత్వం గ్రామ సభకు విచ్చేసిన ఎమ్మెల్యేను మండల వీఓఏ సంఘం ప్రతినిధులు గణపనేని సరళ, కొల్లూరి నాని, నాగమణి, రజని ఆధ్వర్యంలో 40 మంది వీఓఏలు కలసి తమ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి నుంచి ఆగస్టు నెల వరకు జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌ను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఫోన్ ద్వారా ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే జీతాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని వీఓఏలకు హామీ ఇచ్చారు. లంక భూముల్లో పంటలు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించడంతో పాటు పాడైపోయిన బోర్లు వేయించాలని, విద్యుత్ పునరుద్ధరణ చేయించాలని కోరుతూ శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్ ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు.



ఎస్ఐ సత్యనారాయణకు స్వల్ప గాయాలు

పెడన: గుడ్లవల్లేరులో నివాసం ఉండే ఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో స్టేషన్‌లో విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా కారు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎస్ఐ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

23, 24 తేదీల్లో మండల స్థాయి ఫెడరేషన్ స్కూల్ గేమ్స్

నాగాయలంక: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23,24 తేదీలలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల స్పోర్ట్స్ కన్వీనర్ కోసూరు పూర్ణచంద్రరావు, స్థానిక జెడ్పీహెచ్ఎస్ పీడీ గాజుల లక్ష్మీప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గుర్తింపు పొందిన విద్యాసంస్థలు, జిల్లాపరిషత్ స్కూల్స్ బాల బాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. గేమ్స్‌లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్ ఈవెంట్స్ నిర్వహిస్తారని, పోటీలన్నీ నాగాయలంక జెడ్పీ హైస్కూల్ ప్లస్ గ్రౌండ్స్‌లో జరుగుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వివరాల కోసం 99083 35876, 94929 76023 నంబర్లలో సంప్రదించవచ్చని, క్రీడాకారులు సీనియర్స్ విభాగంలో జనవరి 1, 2008, జూనియర్స్ జనవరి 1, 2011 తర్వాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు.

రహదారిలో ముళ్లకంప తొలగింపు

కె.కొత్తపాలెం(మోపిదేవి): వరద ప్రభావిత గ్రామం కె.కొత్తపాలెంలో కృష్ణానదికి వెళ్లే రహదారిలో పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం పొక్లెయిన్ సాయంతో రోడ్డుకు అడ్డుగా ఉన్న ముళ్లకంపను తొలగించారు. గ్రామ సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆద్యంతం అలరించిన దేవనర్తకి నాటకం

నాగాయలంక: స్థానిక ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో కొనసాగుతున్న 67వ వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవాలలో స్వామి నిమజ్జనం తదుపరి 20వ రోజు శుక్రవారం రాత్రి ప్రదర్శించిన దేవనర్తకి(భక్త చింతామణి) జానపద, పౌరాణిక పూర్తి నాటకం ప్రేక్షకులను అలరించింది. రంగస్థల కళాకారులు అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు పొందారు.

రేపు భక్తులకు మహా అన్నసంతర్పణ

వినాయక నవరాత్రులు ముగిసిన సందర్భంగా సోమవారం రాత్రి 6 గంటలకు ప్రసన్న గణపతి ఆలయ ప్రాంగణంలో పది వేల మందికి మహా అన్న సంతర్పణ నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ బాలవర్ధిరావు తెలిపారు.